(ఊహా ప్రహేళిక)

# సందర్శనం

(ముక్కోటి ఏకాదశినాటి స్వామి సందర్శనలో ఒక అన్వేషి....)

రచన:

శ్రీ స్వర్ణరాజ హనుమంతరావు

ఇంత గడగడా వణికే చలిలో, ఇంత తెల్లవారుఝాములో లేచి; యీ తడియిసుకలో పడికాళ్ళీడ్చుకుంటూ, ఈ మసకచీకట్లో తడుముకుంటూ, ఈ ఎత్తుపల్లాల్లో పడుతూ లేస్తూ, మంచుకన్న చల్లగా - మునిగితే ఒక్కసారి రక్తం గడ్డకట్టేట్టు వున్న ఈ నీళ్ళల్లో మునిగి, గెంతుతూ గెంతుతూ ఇంత దూరం ఎందుకు వచ్చాననుకుంటున్నావ్ ?

నీ దివ్య మంగళ విగ్రహాన్ని సందర్శించటానికి కాదు. నా అన్వేషణ నొకసారి సాగిద్దామని వచ్చాను. నా సుందరి నిక్కడ చూసుకుందామని వచ్చాను. అప్పటినుండి ఇప్పటివరకు అంతా గాలించి వేశాను. సత్రాలు, బావిళ్లు, కోనేరు, గోపురం, చంద్రశాలలు, స్థంభాల మంటపాలు, కల్యాణ మంటపం - అన్నీ చూసి చూసి తిరిగొచ్చాను.

అక్కడొకచోట శంఖంలాంటి నా సుందరి కంఠం కనుపించింది పరీక్షగా చూశాను. కాని నా సుందరికాదామె ; అలా వస్తూవుంటే ఆ గుడివెనుక ఆ వాలు కనులు కనుపించినట్లయి వడివడిగా నడిచాను ఆ కను పాపల్లో నారూపంలేదు. అవి కేవలం అనుకరణ సరకులాంటివి. అల్లంత దూరాన నా సుందరి అలా నడచినట్లుంది; చూశాను; ఆ హొయలామెవే గాని, అది ఆమె మూర్తి కానేకాదు ఆ మూతేదో నవ్వువినిపించి అటు తిరిగి చూశాను. ఆ ధ్వని ఆలాంటిదేకాని ఆ తరువాత మెరిసేసిగ్గు దొంతరలు ఆ ముఖంపై కనుపిస్తేనేగా ! గోపురంలోనుంచి బయటి కొస్తూవుంటే నా సుందరి మాటలాగ వినిపించింది. వెనకా, ముందూ అంతా కలయ జూశాను. మళ్ళీ మాట వినిపించలేదు. మాటవినిపించకపోవటమే గాదు, అసలు మనిషన్నమాటే కనిపించలేదు.

ఎందుకిలా బాధపెడతావు చెప్పు? ఈ లక్షమంది జనాన్ని చూసి పోదామనిరాలేదు. నా సుందరి నా కళ్ళముందు ప్రత్యక్షమవుతుందని వచ్చాను. ఎందుకింతమందిలో నన్నొక్కణ్ణే యిలా యాతనపెడతావ్ ? అక్కడక్కడా కనుపించేటట్లువేసి అదృశ్యం చేస్తావ్ ? ఏమిటీ ఇంద్రజాలం ! నా ఒక్క సుందరి రూపాన్ని భిన్నంచేసి వీళ్లందరికీ పంచిపెట్టావా ? అవును, అంతే ఐవుండాలి. లేకపోతే ఆ ఛాయలెందుకు కనిపిస్తాయి అక్కడక్కడా ! అంతే చేసుంటావు నీవు !

నన్ను రానీకుండా ఆపేసి, నా సుందరి నలా ముందుకు నడిపించుకొనిపోయి నేనందుకోలేనంత వేగంతో, నా కందనంత దూరంగా, అలా తీసికెళ్ళి విడచిపెట్టి ఏమీ ఎఱుగనట్లు నా యెదుట నిలబడి నాటకమాడుతున్నావ్ !

అయినా నా సుందరి అప్పుడు దీనంగా చూస్తూ; దగ్గరగా, దూరంగా, పిలుస్తూనే వెళ్ళింది. అవివేకినినేనే. అంతగా పట్టించుకోలేదప్పుడు. లేకపోతే అడ్డుపడేవాణ్ణే; నేలేకుండా. నే రాకుండా నీవెలా కదిలేవాడివో ముందుకు - నా సుందరితో- చూసేవాణ్ణి. నీ ఆట కట్టించేవాణ్ణి!

కాని చెయ్యి మిగిలిపోయింది. వ్యవహారం మించిపోయింది !

అయినా నీకు అసూయ జాస్తి అనిపిస్తోంది చూస్తే ! ఆ ముక్కోటినాడు నీ పట్టమహిషి పరమపదించిందని నా ప్రణయిని సాన్నిహిత్యంలేకుండా నాకు దూరం చేస్తావా ? పండితుడన్నారు నిన్ను పరమమూఢుడివి నిజం ! అమాత్రం విషయాల్ని అర్థం చేసుకోలేని నీవు అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడవేమిటి ? హాస్యాస్పదం ; అన్నింటికీ అతీతుడన్నారునిన్ను. కాని చాంచల్యం ఒక్క దానికే మినహాయింపు వుంది.

అయినా అదేమిటి, నా సంగతి వదిలేసెయ్ ! అమ్మవారు పరమపదించిందని కదూ ఇవాళ — అనుకుంటున్నారంతా ! ఏకాదశినాడు పరమపదించి పెళ్లిపోయిందన్నారు మరి, వయ్యారంగా నీ ప్రక్కన ఒదిగి కూర్చునే వుందిగా ! ఏమిటీ నాటకమంతా ? ఓ హో ! భక్తుణ్ణి కాదుగా నేను. అందుకని అర్థం కావటంలేదు కామోసు నీ లీలలు !

అయినా హేమంతం అయిపోతోంది. శిశిరంగడిస్తేచాలు, వసంతం వచ్చేసరికి మళ్ళీ కళ్యాణం. నిత్యకళ్యాణం, పచ్చని తోరణం. బాగు బాగు. బాగుంది నీ వ్యవహారం ; నమ్ముకున్న వాళ్లని ముమ్మనట్టేటముంచు. నీ వరకూ నీవేమో నీ సంగతి చూసుకో !

నా జీవితాన ఈగడుస్తున్న హేమంతం, తరువాత వస్తున్న శిశిరం జీవితాంతం అలానే వుండిపోతై. వసంతం మళ్ళీ రావటం జరగదు. చెలి యెరికటల్ని తన్నుతూ, జీవన నదిలా పొంగుతూ ప్రవహించాల్సిన నా ప్రేమ వాహిని, శిశిరంలో నదిలో పల్లాన నిలిచిన నీటిపాయలాగ, ఆశించిన అనుభవంకాక అనుభూతిమాత్రం నిలచిపోయి ఆ మాత్రంగా ఈ యాత్ర ఇలా సాగుతోంది.

ఈ నిలచిన చివరి పాయలోని జీవనవనం కూడ ఒక్కొక్కప్పుడు ఆవిరైపోయియినుక మిగిలిపోయినట్లు, ఈ అనుభూతికూడ అదృశ్యమైపోయి జీవితం ఎండమావుల్ని వెతుక్కోవటమౌతుందేమో!

అయినా ఏమిటిచంతాను ? ఎందుకు నీకు నివేదించుకుంటున్నాను! నీకు కావలసింది నీరుకొంకాయలు, ఆపైన కప్రపు టారతులు నేనియ్యలేనివి. ఎందుకు నీకివ్వటం?

అసలు ఈ సందర్శనం మాత్రమెందుకు - నా సుందరిని సందర్శించలేకపోయిన తర్వాత, శెలవ్ !

—o—